క్లుప్తంగా

బీటీపీని పరిశీలించిన అసిస్టెంట్ కలెక్టర్



అధికారులతో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్

గుమ్మఘట్ట: బీటీపీపై నిత్యం అప్రమత్తంగా ఉండాలని అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న తెలిపారు. శనివారం మండలంలోని బీటీపీ ప్రాజెక్టును పరిశీలించారు. ఎగువున కర్ణాటక నుంచి ఎన్ని కూసెక్కుల వరదనీరు వస్తుందని సిబ్బందితో ఆరా తీశారు. నీటి ఉధృతి అధికంగా ఉంటే జిల్లా అధికారులకు సమాచారం అందించాలన్నారు. తక్కువ నీటి ఉధృతి ఉన్నప్పుడు హగరికి వదులుతున్న నీటిని నిలిపివేయాలన్నారు. కార్యక్రమంలో డీటీ రఘు, ఆర్ఐ, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఏడీఈగా శ్రీనివాసనాయుడు



రాయదుర్గంటౌన్: రాయదుర్గం విద్యుత్ శాఖ ఏడీఈగా శ్రీనివాస నాయుడు శనివారం అధికారిక బాధ్యతలు చేపట్టారు. ఈయన కళ్యాణదుర్గం రూరల్ విద్యుత్‌శాఖ ఏడీఈగా పనిచేస్తున్న ఇక్కడికి బదిలీపై వచ్చారు.

కనకదాస విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



భూమి పూజ చేస్తున్న నాయకులు

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని స్థానిక హిందూపురం రోడ్డు వద్ద భక్త కనకదాసు విగ్రహ ఏర్పాటుకు కురుబ సంఘం నాయకులు శనివారం భూమిపూజ చేశారు. ఈసందర్భంగా కురుబ సంఘం నేత ఆంజనేయులు మాట్లాడుతూ కురుబలు అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఈసీ మెంబర్ మల్లాపురం దొణస్వామి, కురుబసంఘం తాలూకా గౌరవ అధ్యక్షుడు దొణస్వామి, తాలూకా అధ్యక్షులు నాగరాజు, బ్రహసముద్రం సింగిల్ విండో అధ్యక్షులు రామాంజనేయులు, యువజన సంఘం గౌరవ అధ్యక్షుడు పాతలింగప్ప, రేవన్న, మల్లాపురం మల్లికార్జున పాల్గొన్నారు.

వేదావతి ఉధృతి తగ్గిన తర్వాతే కల్వర్టు నిర్మాణం



కల్వర్టును పరిశీలిస్తున్న ఆర్అండ్‌బీ ఈఈ ప్రసాద్‌రెడ్డి, డీఈఈ రవిశంకర్‌రెడ్డి

బొమ్మనహాళ్: కల్లుదేవనహళ్లి బందూరు గ్రామాల మధ్యలో ఉన్న కల్వర్టు, రోడ్డు ఇటీవల కురిసిన భారీ వర్షానికి కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. దీంతో ఆర్అండ్‌బీ ఈఈ ప్రసాద్‌రెడ్డి, డీఈఈ రవిశంకర్‌రెడ్డి పరిశీలించారు. కల్వర్టు నిర్మాణానికి ఎంత ఖర్చవుతుందో నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు. పస్తుతం నీరు మరింత ఉధృతంగా ప్రవహిస్తుండంతో పనులు చేయలేమని నీళ్లు తగ్గిన తర్వాతే కల్వర్టు నిర్మించి, ప్రజలకు రాకపోకల కోసం సౌకర్యం కల్పిస్తామన్నారు.

విద్యారంగం నిర్వీర్యం

ఉరవకొండ: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత విద్యావ్యవస్థను ఆశాఖ మంత్రి నారా లోకేష్ భ్రష్టుపట్టించారని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సిద్ధార్ధ్ విమర్శించారు. శనివారం స్థానిక ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిద్ధార్థ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయలేదన్నారు.

ఎర్ర మట్టి తరలింపును అడ్డుకోండి

కూడేరు: కూడేరు పొలం సర్వే నం. 535లో ఏపీఐఐసీకి కేటాయించిన భూమిలో కొందరు జేసీబీలు పెట్టి మట్టిని తరలిస్తున్నా రని ఏపీఐఐసీ సిబ్బంది బాషా రెవెన్యూ అధికా రులు, సీఐ శివ రాముడును శనివారం కలిసి ఫిర్యాదు చేశారు. 535 సర్వేనంబర్‌లోని 460 ఎకరాల్లో 350 ఎకరాలు ఏపీఐఐసీకి కేటాయించారన్నారు.

జాతీయ, రాష్ట్రస్థాయిలో ఉరవకొండ విద్యార్థుల ప్రతిభ



జాతీయ, రాష్ట్ర స్థాయిపోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఇన్‌చార్జ్ హెచ్ఎం హనీఫ్

ఉరవకొండ: స్థానిక ప్రభుత్వ జెడ్పీ సెంట్రల్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఇందుమతి జాతీయ స్థాయి ముగ్గుల పోటీలకు, 9వతరగతి చదువుతున్న హిమబిందు, విజయలక్ష్మి రాష్ట్ర స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారని ఇన్‌చార్జ్ హెచ్ఎం హనీఫ్, ఉపాధ్యాయురాలు పద్మావతి శనివారం తెలిపారు. పీడీ మారుతీప్రసాద్, డేవిడ్, కిరణ్, ఆర్ట్ ఉపాధ్యాయురాలు శంకర్, రోహిణి అభినందించారు.

కృషి ఒకరిది.. పేరు మరొకరిది అన్నట్లుంది ఉరవకొండ టీడీపీ నాయకుల తీరు. నియోజకవర్గ అభివృద్ధిని ఏనాడూ పట్టించుకోలేదు.. కనీసం పేదలు తలదాచుకునేందుకు పక్కా ఇళ్లు మంజూరు చేయించలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పం.. మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి కృషితో వేలాది పేదల సొంతింటి కల తీరింది. రాష్ట్రంలోనే రికార్డు స్థాయిలో ఇంటి పట్టాలు, పక్కా ఇళ్లు మంజూరయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన వెంటనే జగనన్న కాలనీలకు మంత్రి పయ్యావుల పేరు పెట్టాలని నిర్ణయించడంపై స్థానిక ప్రజలు నవ్వుకుంటున్నారు.

– ఉరవకొండ :



ఉరవకొండలో పేదలకు ఇంటి పట్టాలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి (ఫైల్)

తమ్ముళ్లూ..ఇదేం తీరు!

- కొలిమి, రాయంపల్లి జగనన్న కాలనీలకు మంత్రి కేశవ్ పేరు
- పంచాయతీలో 10 మంది వార్డు సభ్యులు మద్దతు తెలుపుతూ తీర్మానం
- వైఎస్సార్ హయాంలో 88 ఎకరాల భూమి కొనుగోలు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 3,500 మందికి ఇంటి పట్టాలు, 21 వేల పక్కా ఇళ్ల నిర్మాణాలు
- పేదల ఇంటి పట్టాల కోసం సుదీర్ఘ పోరాటాలు చేసిన మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

2008లో మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో ఉరవకొండలోని పేదలకు పట్టాలు పంపిణీ చేయడానికి రూ.కోటి వెచ్చించి 88 ఎకరాలు కొనుగోలు చేశారు. 2014లో అధికారం చేపట్టిన టీడీపీ ప్రభుత్వం.. పేదలకు ఆ భూమిని పంపిణీ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించింది. ఐదేళ్ల కాలంలో సెంటు భూమిని ఒక్క నిరుపేదకు కూడా పంపిణీ చేయలేదు. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన వెంటనే రికార్డు స్థాయిలో ఉరవకొండ నియోజకవర్గంలో దాదాపు 3500 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చింది. జిల్లాలో ఎక్కడాలేని విధంగా ఉరవకొండకు 26 వేల పక్కా గృహాలు మంజురు చేసింది. జగనన్న (కాలనీల్లో) లేఔట్‌లో ఎంతో మంది పేదలు తలదాచుకుంటున్నారు. ఇదంతా నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పం .. మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి కృషి ఫలితమేనని పేదలు తలుచుకుంటున్నారు.

బోగస్ పట్టాలతో పేదలను బురిడీ కొట్టించిన టీడీపీ

2019 సార్వత్రిక ఎన్నికల వేళ ఓట్ల కోసం అప్పటి టీడీపీ అభ్యర్థి పయ్యావుల కేశవ్ పేదలకు దొంగ పట్టాలు పంపిణీ చేసి, బురిడీ కొట్టించారు. ఏకంగా 15 సర్వే నంబర్లు పొందుపరిచి హద్దులు సూచించకుండా తయారు చేసిన చిత్తుపేపర్లను పంపిణీ చేసి, ఎన్నికల్లో ఓట్లు దండుకున్నారు.

జగన్‌తోనే పేదల సొంతింటి కల సాకారం ..

2019లో అధికారం చేపట్టిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం .. ఉరవకొండలో పేదలకు ఇంటి పట్టాలు ఇచ్చేందుకు ప్రత్యేక చొరవ చూపింది.



జగనన్న కాలనీ

నవరత్నాల పేరుతో పేదలందరికీ ఇళ్ల పథకం కింద అర్హత ఉంటే చాలు..ఇళ్ల స్థలాలు కేటాయించింది. వైఎస్సార్ హయాంలో కొనుగోలు చేసిన భూమిని 1.50 సెంటు ప్రకారం పేదలకు పంపిణీ చేశారు. అప్పట్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని పలుమార్లు కలిసి ఉరవకొండలో 3,500 మందికి ఇంటి పట్టాలు మంజూరు చేయించారు. ఉరవకొండ నియోజకవర్గానికి 21 వేల పక్కా ఇళ్లు మంజూరు చేయించారు.

జగనన్న కాలనీలకు మంత్రి కేశవ్ పేరు పెట్టేలా తీర్మానం

'నవ్వి పోదురుగాక మాకేంటి సిగ్గు' అన్న చందంగా మారింది ఉరవకొండ టీడీపీ నేతల తీరు. మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో కొనుగోలు చేసిన 88 ఎకరాల స్థలాన్ని, ముఖ్యమంత్రి హోదాలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పంపిణీ చేసి, రూ.కోట్లు వెచ్చించి పక్కా ఇళ్లు నిర్మించారు. ఈనెల 20న నాటకీయ పరిణామాల మధ్య జరిగిన ఉరవకొండ మేజర్ పంచాయతీ సమావేశంలో 8 మంది టీడీపీ వార్డు సభ్యులతో పాటు మరో ఇద్దరు వైఎస్సార్‌సీపీ వార్డు సభ్యులు సైతం నిస్సిగ్గుగా దీనికి మద్దతు తెలిపారు. మరో ఉపసర్పంచ్‌తో పాటు 8 మంది వైఎస్సార్‌సీపీ వార్డు సభ్యులు జగనన్న లేఅవుట్ కాలనీ పేర్లు మార్చరాదంటూ ఓటు వేశారు.

మంత్రి పేరు పెట్టడానికి సిగ్గులేదా?



పేదలకు దొంగ పట్టాలు ఇచ్చి నిలువునా ప్రజలను మోసగించి, 2019 ఎన్నికల్లో దొడ్డిదారిన గెలిచిన పయ్యావుల కేశవ్‌కు ఏరోజూ పేదలకు పట్టాలు ఇచ్చి, వారికి పక్కా ఇళ్లు కట్టించాలన్న ఆలోచన రాలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి కృషితో ఏర్పాటయిన కాలనీలకు కేశవ్ పేరు పెట్టుకోవడానికి సిగ్గుండాలి.

– మీనుగ లలితమ్మ, సర్పంచ్, ఉరవకొండ

దిగజారుడు రాజకీయం



టీడీపీ హయాంలో ఒక్కరికి కూడా సెంటు స్థలం పంపిణీ చేయలేదు. కనీసం ఒక ఇల్లు కూడా మంజూరు చేయలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పేదలకు పట్టాలు పంపిణీ చేసి, వారికి పక్కా ఇళ్లు నిర్మిస్తే, దానికి కూడా మంత్రి కేశవ్ పేరు పెట్టేందుకు తీర్మానం చేయడం సరికాదు.

– వన్నప్ప, ఉప సర్పంచ్, మేజర్ పంచాయతీ, ఉరవకొండ

మెజార్టీ సభ్యుల ఆమోదం మేరకే తీర్మానం



మెజార్టీ సభ్యులు ఆమోదం తెలపడంతోనే రాయంపల్లి, కొలిమి లేఅవుట్ కాలనీలకు మంత్రి పయ్యావుల కేశవ్ పేరు పెడుతూ కాలనీలకు స్వాగత ద్వారాలు ఏర్పాటు చేసుకోవడానికి తీర్మానం చేయించాం. మొత్తం పది మంది సభ్యులు మంత్రి కేశవ్ పెరు పెట్టడానికి అనుకులంగా ఉంటే.. ఎనిమిది మంది సభ్యులు వ్యతిరేకంగా ఓటు వేశారు.

– గౌస్ సాహెబ్, పంచాయతీ కార్యదర్శి, ఉరవకొండ

విద్యుత్ చార్జీల పెంపును ఉపసంహరించుకోవాలి



ఏడీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

ఉరవకొండ: ప్రభుత్వం ఇంధన సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై రూ.కోట్ల భారం వేయడాన్ని వ్యతిరేకిస్తూ ఉరవకొండలోని విద్యుత్ శాఖ ఏడీ కార్యాలయం ఎదుట సీపీఎం నాయకులు శనివారం ధర్నా చేశారు. సీపీఎం మండల కార్యదర్శి మధు, ప్రాంతీయ కార్యదర్శి రంగారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే పెంచిన విద్యుత్ ఇంధన సర్దుబాటు చార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు సిద్దప్ప, మురళీ, సూర్యనారాయణ, వెంకటేశసులు, శీనప్ప పాల్గొన్నారు.

రాయదుర్గంటౌన్: ప్రజలపై విద్యుత్ చార్జీల భారాన్ని మోపడం సరికాదని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బి.మల్లికార్జున మండిపడ్డారు. శనివారం విద్యుత్‌శాఖ డీఈ శ్రీనివాసనాయుడును కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. సీపీఎం నాయకులు కృష్ణనాయక్, మధు, తిమ్మరాజు, ఆంజనేయులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల భారం మోపడం దారుణం

కూడేరు: కూటమి అధికారంలోకి వచ్చాక విద్యుత్ చార్జీల భారాన్ని ప్రజలపై మోపడం దారుణమని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కృష్ణమూర్తి మండిపడ్డారు. శనివారం కూడేరులో వారువిలేకరులతో మాట్లాడారు. ఎఫ్‌పీపీసీఏ చార్జీల పేరిట ప్రజలపై రూ. కోట్ల భారాన్ని మోపుతూ ఏపీ విద్యుత్ రెగ్యులేటర్ కమిషన్ ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు కూడేరులోని ట్రాన్స్‌కో కార్యాలయానికి వెళ్లి అక్కడి అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు వెంకటేశులు, కరీం, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ పరికరాలకు దరఖాస్తుల ఆహ్వానం

కుందుర్పి: స్థానిక కుసుమగిరి రైతు ఉత్పత్తి దారుల కంపెనీ లిమిటెడ్ వారి సౌజన్యంతో దివ్యాంగులకు ఉచితంగా కృత్రిక పరికరాలు అందజేస్తున్నట్లు సంస్థ సీఈఓ నరసింహమూర్తి, డైరెక్టర్ లక్ష్మీపతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

శెట్టూరు: మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయానికి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు రూ.50 వేలు విరాళం అందజేశారు. శనివారం మండల కేంద్రంలో గ్రామ పెద్దలు సోమనాథ రెడ్డి, హరినాథ రెడ్డి, బోయ తిప్పేస్వామి, వీరాంజనేయులు, రామాంజయులు, కేశవ రెడ్డి, అదిశేషు, గురుప్రసాద్, అబ్దుల్ రజాక్, నాగేష్, సర్పంచ్ కుమార్ ఎమ్మెల్యేను కలిసి ఆలయ నిర్మాణానికి విరాళం అడిగారు.

పాఠశాల భవన నిర్మాణ పనుల పరిశీలన



నూతిమడుగులో అర్ధంతరంగా ఆగిపోయిన గురుకుల పాఠశాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

కంబదూరు: మండలంలోని నూతిమడుగు గ్రామంలో అర్ధంతరంగా ఆగిపోయిన ఏపీఆర్ఎస్ గురుకుల బాలుర పాఠశాల భవన నిర్మాణాన్ని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు శనివారం పరిశీలించారు. పనులు ఆగిపోవడానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు కూలిపోయిన నూతిమడుగు పెన్ననది బిడ్జిని కూడా పరిశీలించారు.

కూలిపోయిన కనకరాయ ఆలయ గోడ

కంబదూరు: మండలంలోని జెక్కిరెడ్డిపల్లి గ్రామంలో కనకరాయ నరసింహస్వామి ఆలయ గోడ కూలిపోయింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఆలయంలో గోడలన్నీ తడిసిదెబ్బతిన్నాయి. శుక్రవారం అర్ధరాత్రి ఆలయ గోడ కూలిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు.

పునరావాస కేంద్రానికి తరలింపు

రాయదుర్గంటౌన్:మతిస్థితిమితం కోల్పోయిన నలుగురిని మనోబంధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో విజయవాడలోని పునరావాస కేంద్రానికి శనివారం తరలించారు. రాష్ట్రంలో ఎక్కడైనా సరే ఇలాంటి వారి సమాచారం సెల్: 9246563738లో తెలియజేయాలని కోరారు.

సంక్షిప్త సమాచారం

తూతూ మంత్రంగా కోఆర్డినేషన్ సమావేశం

శెట్టూరు: మండలంలో జరిగిన ఉపాధిహామీ పనుల పరిశీలనకు వచ్చిన సామాజిక తనిఖీ బృందంతో శనివారం నిర్వహించిన కోఆర్డినేషన్ సమావేశం నామమాత్రంగా జరిగింది. కేవలం 10 నిమిషాల్లో సమావేశం ముగిసిపోయింది. సమావేశానికి ఎంపీడీఓగాని, సంబంధిత అధికారి ఏపీఓ నీరజ కూడా హాజరుకాలేదు. పీఆర్, హౌసింగ్, ఫారెస్ట్ అధికారులు హాజరుకాకుండానేమీటింగ్ నిర్వహించారు. సామాజిక తనిఖీ బృందం తనిఖీ చే యాల్సి ఉండగా, సమావేశాన్ని నవంబర్ 2వతేదీకి వాయిదా వేశారు.

పశుగణన వివరాలు సమగ్రంగా సేకరించండి



శ్రీరంగాపురంలో పశుగణన పోస్టర్లతో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

బెళుగుప్ప: మండలంలోని గ్రామాల్లో 21వ అఖిల భారత పశుగణన వివరాలను పశువైద్య సిబ్బంది సమగ్రంగా చేపట్టాలని పశువైద్య కేంద్రం వైద్యాధికారి రమేష్ సూచించారు. గ్రామాల్లో బడి గుడి, ప్రభుత్వ కార్యాలయాల వద్ద పశుగణన పోస్టర్లను అతికించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. శనివారం మండల పరిధిలోని ఎర్రగుడి, శ్రీరంగాపురం, రామసాగరం, గుండ్లపల్లి, నరసాపురం, తగ్గుపర్తి, హనిమరెడ్డిపల్లి గ్రామాల్లో పశుగణన సర్వే చేపట్టినట్లు పశువైద్యాధికారి పేర్కొన్నారు.

బొమ్మనహాళ్: పశుగణనను పకడ్బందీగా చేయాలని ఎంపీపీ పద్మ, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ దాస్ నాయక్ అన్నారు. శనివారం పశువైద్యాధికారి వెంకట్‌రెడ్డితో కలిసి మండల పరిషత్ కార్యాలయంలో పశుగణనను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్ఐ నబీరసూల్, ఈఓపీఆర్‌డీ దాస్ పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

కళ్యాణదుర్గం రూరల్: ప్రభుత్వం విద్యార్థుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు వంశీ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి, అధికారులకు వినతి పత్రం అందించారు.కార్యక్రమంలో జిల్లా సహాయ భీమేష్, అరవింద్, ధనుష్, ఆదర్శ్ నరసింహ, జయ ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వైర్లను పునరుద్ధరించండి

కుందుర్పి: బెస్తరపల్లి - కెంచంపల్లి 11 కేవీ విద్యుత్ వైర్లు కెంచంపల్లి సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి తెగిపడినట్లు రైతులు తెలిపారు. వైర్లు తెగిపడి 24 గంటలు గడుస్తున్నా విద్యుత్ సిబ్బంది పట్టించుకోలేదని స్థానిక సర్పంచ్ గంగాధర రైతులు పాపన్న, రాజప్ప, తదితరులు తెలిపారు.

బెల్టు షాపులు నిర్వహిస్తే చర్యలు

కూడేరు: గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవని సీఐ శివరాముడు బ్రాంది షాపు నిర్వాహకులకు హెచ్చరించారు. శనివారం ఆయన తన చాంబర్‌లో మండలంలోని మద్యం షాపుల నిర్వాహకులతో మాట్లాడారు. నిబంధనల మేరకు మద్యం షాపులు నిర్వహించాలన్నారు. మద్యం దుకాణాల వద్ద తప్పకకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

సమయ పాలన పాటించని ఉద్యోగులు



సచివాలయంలో 12 గంటలైనా విధులకు హాజరుకాని ఉద్యోగులు

బొమ్మనహాళ్: మండలంలోని ఉంతకల్లు గ్రామ సచివాలయ తలుపులు శనివారం ఉదయం 11.30 గంటలైన దాటినా తెరుచుకోలేదు. దీంతో వివిధ పనులు నిమిత్తం వచ్చిన వారు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి. రోజూ సచివాలయంలో ఉద్యోగులతో పాటు వీఆర్‌ఓ, కార్యదర్శులు అందుబాటులో ఉండాలి. అయితే సిబ్బంది ఇష్టారాజ్యంగా విధులకు హాజరవుతున్నారని ప్రజలు అంటున్నారు.

అట్రాసిటీ చట్టం పకడ్బందీగా అమలు చేయాలి

కళ్యాణదుర్గం రూరల్: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం పకడ్బందీగా అమలు చేయాలని ఇన్‌చార్జ్ ఆర్‌డీఓ వినూత్న అధికారులను ఆదేశించారు. శనివారం పట్టణంలోని ఆర్‌డీఓ కార్యాలయంలో డివిజన్ స్థాయి విజిలెన్స్, మానిటరింగ్‌పై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆర్డీవో వినూత్న మాట్లాడుతూ బొమ్మనహాల్, కంబదూరు మండలాల్లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు ఎక్కువగా వస్తున్నాయని, ఇందుకు కారణమయ్యే వారిని ముందస్తుగా గుర్తించాలన్నారు. ప్రతి మూడు నెలలకోసారి ఎస్సీ, ఎస్టీ సమస్యలపై సమావేశం నిర్వహించాలన్నారు. కంబదూరు జెడ్పీటీసీ నాగరాజు, కళ్యాణదుర్గం ఎంపీపీ మారుతమ్మ మాట్లాడారు. తహసీల్దార్‌లు, ఎంపీడీఓలు, సీడీపీఓలు, ఎన్జీవోలకు చెందిన మెంబర్లు సుబ్బారావు, ఉపేంద్ర, హరీష్, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు మోహన్ పాల్గొన్నారు.

సమన్వయంతో మండలాభివృద్ధి

బొమ్మనహాళ్: అధికారులు, ప్రజాప్రతినిధులు అందరి సహకారంతో మండలాభివృద్ధికి కృషి చేయనున్నట్లు ఎంపీపీ పద్మ అన్నారు. శనివారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా శాఖల వారీగా చేపట్టిన పురోగతి, అభివృద్ధిపై అధికారులు వివరించారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. ఎంపీడీఓ దాస్‌నాయక్ మాట్లాడుతూ సమావేశానికి గైర్హాజరైన అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. తహసీల్దార్ మునివేలు మాట్లాడుతూ 6 గ్రామాల్లో రీసర్వే జరిగిందన్నారు. ఆయా గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి, రైతులను నుంచి సమస్యలపై అర్జీలను స్వీకరించామన్నారు. ఎస్ఐ నబీరసూల్ మాటాడారు. వైద్యాధికారులు శ్రీలక్ష్మీ, కుమారరాజా, కోఆప్షన్ మెంబర్ మాబుసాబ్, పశువైద్యాధికారి వెంకట్‌రెడ్డి, ఎంఈఓలు మల్లికార్జున, ఈరన్న, ఉద్యానశాఖ అధికారిణీ మౌనిక, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

తవ్వుకున్నోళ్లకు తవ్వుకున్నంత

- సరిహద్దులో బరితెగిస్తున్న అధికార పార్టీ నాయకులు
- జాతీయ రహదారి పక్కనే బారీగా గ్రావెల్ తవ్వకాలు
- డీ హీరేహాళ్ మండలంలో రేయింబవళ్లు దోపిడీ
- నిత్యం 300 టిప్పుల మట్టి రవాణా



మట్టి తరలింపును అడ్డుకుంటున్న గ్రామస్తులు

డీ హీరేహాళ్ (రాయదుర్గం): కర్ణాటక సరిహద్దున ఉన్న రాయదుర్గంలో గనుల దోపిడీ ఇష్టారాజ్యంగా సాగుతోంది. అధికార పార్టీ నాయకులు కొందరు కొండ, గుట్ట, మెట్ట అన్నీ మావే అన్నట్లు కొల్లగొట్టేస్తున్నారు. సరిహద్దు ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకుని దోపిడీ పర్వానికి తెరతీశారు. యథేచ్ఛగా ప్రకృతి సంపద అయిన ఇసుక, మట్టి అక్రమంగా తరలిస్తూ రూ.కోట్లు అర్జిస్తున్నారు. బళ్లారి– బెంగళూరు జాతీయ రహదారికి నియోజకవర్గ కేంద్రానికి ఆనుకొని ఉన్న డీ హీరేహాళ్ మండలం మీదుగా వెళ్లింది. ఇదే అక్రమార్కులకు దోపిడీకి మార్గమైంది. డి హీరేహాళ్ మండలంలోని ఓబుళాపురం సమీపంలో జాతీయ రహదారికి ఆనుకుని ఐఎంజీసీ ఫ్యాక్టరీ, కోల్డ్‌స్టోరేజీ మధ్యన ఓ



ఓబుళాపురం సమీపంలో గ్రావెల్ తవ్వుతున్న ఇటాచీ

వచ్చుమిత ఇటాచీతో రాత్రీ పగలు సుమారు వంద టిప్పర్లలో గ్రావెల్‌ను తరలించేస్తున్నారు. దీన్ని గమనించిన గ్రామస్తులు శనివారం మట్టి తవ్వకాలు జరిపే ఇటాచీని అడ్డుకున్నారు. గ్రావెల్ కోసం వచ్చిన టిప్పర్లను తిరిగి పంపా రు. అక్కడి నుంచి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి సర్వే నంబర్ 372–3 లో 5–23 ఎకరాల్లో అక్రమంగా జరిపే మట్టి తవ్వకాలను నిలుపుదల చేయాలని ఫిర్యాదు చేశారు. పోలీసులకు కూడా సమాచారం ఇచ్చారు. ఇదిలా ఉండగా చెక్‌పోస్టు సమీపంలో జాతీయ రహదారి ఆనుకుని మరో చోట యథేచ్ఛగా గ్రావెల్ తరలిస్తున్నారు. నిత్యం 200 ట్రిప్పులకు తక్కువ కాకుండా మట్టి తరలిపోతుందని స్థానికులు చెప్తున్నారు. మడేనహళి వద్దకూడా ప్రభుత్వ భూముల్లోనూ మట్టి తరలిస్తున్నా రు.

బళ్లారిలో వెంచర్లకు తరలింపు

కర్ణాటక రాష్ట్రంలో బళ్లారి వాణిజ్య, గనులు, వ్యాపారం, విద్య, వైద్యం, వ్యవసాయం ఇలా అన్ని రంగాల్లోనూ ప్రసిద్ధి చెందింది. అంతే వేగంగా విస్తరిస్తోంది. దానికి తగ్గట్టుగా సిటీ పరిసరాల్లో ఇబ్బడి ముబ్బడిగా వెంచర్లు పుట్టుకొచ్చాయి. మట్టి అవసరం ఏర్పడింది. ఆ ప్రాంతంలో కొరతను గుర్తించిన కొందరు ఈ అక్రమ వ్యాపారాన్ని సాగిస్తున్నారు. ఒక్కో టిప్పర్ రూ.6,500 నుంచి రూ.7 వేలు ధర పలుకుతుంది. నిత్యం ఆయా ప్రాంతాల నుంచి మూడు వందల ట్రిప్పుల్లో మట్టి తరలిపోతుందని స్థానికులు చెప్తున్నారు. ఈ లెక్కన సుమారు రూ.20 లక్షలు చేతులు మారుతున్నట్లు సమాచారం. ఇసుకాసురులు కూడా అదేదారి పట్టారు. వాగులు, వంకలు, హగరిల్లోని ఇసుకను కుప్పచేసి సరిహద్దు దాటిస్తున్నట్లు ప్రచారం.

ఇష్టారాజ్యంగా తవ్వేస్తున్నారు

ప్రభుత్వ పొలం అనుకుని నా సొంత పొలంలో ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు చేపట్టారు. సాక్షాధారాలతో సహా రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశా. విచారించి న్యాయం చేయాలి. అడ్డుకుంటే ఈ పొలం నీదికాదని బెదిరిస్తున్నారు. గ్రావెల్ తవ్వకానికి అడ్డుకట్టు వేయాలి.

– సురేష్, ఓబుళాపురం, డీ హీరేహాళ్ మండలం

అక్రమంగా గ్రావెల్ తవ్వితే చర్యలు

అనుమతుల్లేకుండా అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటాం. జాతీయ రహదారికి ఆనుకొని మట్టి తవ్వకాలు జరుపుతున్నట్లు సమాచారం అందింది. సత్వరమే పరిశీలించి, వాహనాలను సీజ్ చేయిస్తాం. సరిహద్దు ప్రాంతాల్లోనూ నిఘా పటిష్టం చేస్తాం.

– అనిల్‌కుమార్, తహసీల్దార్, డి హీరేహాళ్

విచారణ చేపడతాం

ప్రకృతి సంపద కొల్లగొడితే కఠిన చర్యలు చేపడతాం. సరిహద్దులో గ్రావెల్ తవ్వకాలపై విచారణ జరిపిస్తాం. అనుమతుల్లేకుండా ఒక్క టిప్పు మట్టి, ఇసుక తరలించినా వాహనాలను సీజ్ చేస్తాం. రెవెన్యూ, పోలీస్, మైనింగ్ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించి అడ్డుకట్టు వేస్తాం.

– వెంకటేశ్వర్లు, మైనింగ్ డీడీ, అనంతపురం